సాక్షి
విశాఖపట్నం
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



పలు కేసుల్లో ముగ్గురు అరెస్ట్

పలు కేసుల్లో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. 8లో



కులమతాల మధ్య బీజేపీ చిచ్చు

కులమతాల మధ్య బీజేపీ చిచ్చుపెడుతోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు ఆరోపించారు. 8లో



నేటి నుంచి ఇండస్ట్రియల్ ఎక్స్‌పో

ఆటోనగర్ డీ– బ్లాక్‌లోని సరిపల్లి గ్రౌండ్‌లో 27, 28, 29వ తేదీల్లో ఇండస్ట్రియల్ అండ్ బిజినెస్ ఎక్స్‌పో జరగనుంది. 8లో

న్యూస్‌రీల్

విశాఖకు ముగ్గురు కొత్త ఏసీపీలు

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖకు కొత్తగా ముగ్గురు ఏసీపీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఇక్కడి నుంచి ఇద్దరు ఏసీపీలను బదిలీ చేసింది. విశాఖ నార్త్ సబ్ డివిజన్ ఏసీపీగా ఎం.శివరామ్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే అనకాపల్లి ఎస్‌డీపీఓగా ఉన్న బి.సునీల్ విశాఖ క్రైం ఏసీపీగాను, గుంటూరులో సీసీఎస్–2 నుంచి బి.మోసెస్‌పాల్‌కు హార్బర్ ఏసీపీగా పోస్టింగ్ కల్పించారు. ఇక్కడ హార్బర్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.శిరీష నెల్లూరుకు బదిలీ అయ్యారు. విశాఖ నార్త్ ఏసీపీగా ఉన్న సిహెచ్.శ్రీనివాసరావును పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉచిత ప్రవేశాలకు నేటితో గడువు పూర్తి

విశాఖ విద్య: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు సీట్లు పొందిన విద్యార్థులు గురువారంలోగా చేరాలని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. విద్యాహక్కు చట్టం మేరకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దరఖాస్తుదారుల్లో ఎంపికైన వారి మొదటి విడత జాబితా ఇప్పటికే విడుదలైందన్నారు. సీట్లు పొందిన వారంతా ఆయా పాఠశాల్లో ప్రవేశాలు పొందాలన్నారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రెండో విడత జాబితా మే 2న విడుదల చేస్తామన్నారు.

ఎంఎస్ఎంఈ అవార్డ్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: అర్హులైన పారిశ్రామికవేత్తల నుంచి ఎంఎస్ఎంఈ నేషనల్ అవార్డ్స్–2023కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జె.చంద్రమౌళి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల పనితీరు, గుర్తింపును దృష్టిలో పెట్టుకుని.. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా జాతీయ స్థాయిలో అవార్డులు అందజేస్తున్నట్లు చెప్పారు. తయారీ రంగం, సేవా విభాగం, ఎగుమతి ఆధారిత సంస్థలు, సాంకేతికంగా తయారీ రంగ సంస్థలు, ప్రత్యేక విభాగంలో తయారీ రంగం, ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామిక వేత్తలు తదితర విభాగాల్లో ఉత్తమ పారిశ్రామికవేత్తలను ఎంపిక చేస్తారన్నారు. తమ దరఖాస్తులను మే10వ తేదీలోగా http://dashboard.msme.gov.in./na కు పంపాలని సూచించారు.

విశాఖ–కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఈ సీజన్‌లో అరకు వెళ్లే రైల్వే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం–కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖలో మే 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్(08551)రైలుకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో మే 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31 తేదీల్లో బయల్దేరే కిరండూల్–విశాఖపట్నం(08552)రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(టెక్నికల్) కె.సుధ తెలిపారు. టైజియో టెక్నాలజీస్, శ్రీనిధి అసోసియేట్స్, ఆప్టెక్, ఫిన్‌కేర్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, రోవర్ ఐటీ టెక్నాలజీస్, సాయి మధు ఇంజినీరింగ్ అండ్ టెక్ సర్వీసెస్, కోజెండ్ ఈ–సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 277 ఖాళీల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. జీఐఎస్ ఇంజినీర్ కేడ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, ఏఎన్ఎం, జీఎస్ఎం, డేటా ఎంట్రీ, రిలేషన్‌షిప్ అధికారులు, ప్లానింగ్ అధికారి, ఐటీ రిక్రూటర్, టెలీకాలర్స్, మేనేజర్ తదితర ఉద్యోగాలకు 10వ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీకామ్(టాలీ), బీటెక్, ఎంబీఏ పూర్తి చేసి ఉండాలి. అభ్యర్థులు https://www.ncs.gov.in/లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి.

27 నుంచి యోగా తరగతులు ప్రారంభం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి సాధారణ యోగా, స్థూలకాయ, వెన్నునొప్పి, మెడనొప్పి నివారణకు ప్రత్యేక యోగా శిబిరం నిర్వహిస్తున్నట్లు సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ ప్రత్యేక శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు 94944 01919, 93980 19922లో సంప్రదించాలని సూచించారు.

సమగ్రాభివృద్ధే మన లక్ష్యం

- ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి
- యువత పెడదారి పట్టకుండా నిఘా పెంచండి
- డీఆర్‌సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశం
- హాజరుకాని టీడీపీ ఎమ్మెల్యేలు



డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, మేయర్ హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, కలెక్టర్ డా. మల్లికార్జున, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలోని ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా సమీక్ష మండలి సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ముందుగా గత డీఆర్‌సీలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై కూలంకషంగా సమీక్షించారు. అనంతరం జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న ఇళ్లు, గృహ నిర్మాణ శాఖ, ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ, నాడు–నేడు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, తదితర అంశాలపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలీస్ పెట్రోలింగ్ పెంచి.. యువత పెడదారి పట్టకుండా నిఘా పెట్టాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో మూడు నెలల్లోగా వీధి లైట్లను ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల పురోగతిపై చర్చించారు. కేజీహెచ్‌లో వైద్య సేవలు మెరుగుపడ్డాయని, ఫోరెన్సిక్ ల్యాబ్ వద్ద మౌలిక సదుపాయాల కోసం రూ.5లక్షలు కేటాయిస్తామన్నారు.

- కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున మాట్లాడుతూ సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణానికి ఉన్న అవరోధాలను అధిగమించి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించి 900 మీటర్ల పరిధిలో భూమి సమస్య, 1.1 కి.మీలో స్ట్రక్చర్స్ గుర్తించామన్నారు. వీరికి త్వరలో నష్ట పరిహారం అందించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. నాలుగు నియోజకవర్గాల్లో రోడ్ల అవసరమైన ప్రాంతాలను గుర్తించి త్వరితగతిన పనులు చేపట్టాలని జీవీఎంసీ సీసీపీ సురేష్‌ను ఆదేశించారు.
- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వీధి లైట్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. వీధి లైట్ల సమస్యలపై ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నంబర్‌ను కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలో కొత్తగా సీహెచ్‌సీ ఏర్పాటు చేయాలన్నారు.
- గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ జీవీఎంసీ 85, 87వ వార్డుల్లో వీధి దీపాలు వెలగడం లేదని, తాగునీరు సమస్య అధికంగా ఉందని, వెంటనే పరిష్కరించాలన్నారు. మున్సిపల్ నీటి కుళాయిల విడుదల సమయాన్ని గంట పాటు పెంచాలన్నారు.
- దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ పాతనగరంలో శిథిలావస్థకు చేరుకున్న ప్రియదర్శిని స్టేడియం భవనాన్ని పునర్నిర్మించాలని కోరారు. కనకమహాలక్ష్మి ఆలయం పరిసరాలు, రోడ్డును విస్తరించాలని సూచించారు.
- పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సుజాతనగర్‌లో పందుల సమస్యను పరిష్కరించాలన్నారు.
- వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ ఆరిలోవ, ఏయూ పరిధిలోని పలు చోట్ల రాత్రి సమయంలో యువకులు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని.. పోలీసులు స్పందించాలని కోరారు.
- జేసీ విశ్వనాథన్ మాట్లాడుతూ యూఎల్సీ భూముల్లో ఇల్లు కట్టుకున్న వారికి స్లాబ్ సిస్టం ద్వారా టైటిల్ డీడ్ పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పట్టాల్లో సవరణలు, పూర్తి హక్కులు పొందుటకు ప్రతి సచివాలయంలో ప్రత్యేక పోర్టల్ అందుబాటులో ఉంటుందని, మే 25లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సమీక్షలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, చిరంజీవి రావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చిన్నతల్లి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు లేక.. టీడీపీ డుమ్మా

జిల్లా సమీక్ష కమిటీ సమావేశానికి ఒక్క టీడీపీ ఎమ్మెల్యే కూడా హాజరుకాలేదు. నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలూ డుమ్మా కొట్టారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్న కనీస బాధ్యత లేకుండా టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతల వ్యవహార శైలిపై ఇన్‌చార్జి మంత్రి స్పందిస్తూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల వారికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రస్తావించేందుకు ప్రజా సమస్యలు ఏం లేకపోవడంతో టీడీపీ ఎమ్మెల్యేలు సమీక్షకు హాజరుకాలేదని వ్యాఖ్యానించారు.

డీఆర్‌డీఏ అధికారులపై ఆగ్రహం

ప్రజా ప్రతినిధులంటే కొంత మంది అధికారులకు లెక్కలేదని.. ముఖ్యంగా డీఆర్‌డీఏ అధికారులపై పలువురు ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి అన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు చెప్పేందుకు కనీసం డీఆర్‌డీఏ ప్రతినిధులు అందుబాటులో లేకపోతే ఎలా అంటూ ఇన్‌చార్జి మంత్రికి తెలిపారు.

బాలికలదే పైచేయి

- ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ
- ఫస్టియర్‌లో 63 శాతం, సెకండియర్‌లో 70 శాతం ఉత్తీర్ణత
- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం



విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా గతంలో కంటే కాస్తా మెరుగుపడింది. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 63 శాతం, ద్వితీయ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొదటి సంవత్సరం పరీక్షలకు 50,647 మంది హాజరుకాగా 31,957 మంది పాసయ్యారు. రెండో సంవత్సరం 42,248 మంది పరీక్షలు రాయగా 29,755 మంది పాసయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు రాష్ట్ర సూచికలో మొదటి సంవత్సరంలో ఐదో స్థానం, రెండో సంవత్సరం ఫలితాల్లో ఆరో స్థానం దక్కింది.

రెండింటిలోనూ బాలికలే..

ఫలితాల్లో బాలురు కంటే బాలికలదే పైచేయిగా నిలిచింది. మొదటి సంవత్సరం బాలురు 25,806 మంది పరీక్షలకు హాజరుకాగా 15,835 మంది పాసయ్యారు. తద్వారా 61 శాతం నమోదైంది. బాలికలు 24,841 మంది పరీక్ష రాయగా 16,122 మంది పాసయ్యారు. 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం బాలురు 20,459 మంది పరీక్ష రాయగా 14,017 మంది పాసయ్యారు. తద్వారా 69 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 21,789 మంది పరీక్ష రాయగా 15,738 మంది పాసయ్యారు. తద్వారా 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో బాలుర కంటే బాలికలే ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు.

ఒకేషనల్‌లోనూ అమ్మాయిలే టాప్

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో 1,458 మంది బాలురు పరీక్ష రాయగా 504 మంది పాసయ్యారు. 35 శాతం ఉత్తీర్ణత వచ్చింది. బాలికలు 2,922 మందికి గాను 1,705 మంది పాసయ్యారు. 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో బాలురు 1,215 మందికి గాను 644 మంది పాసయ్యారు. 53 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 2,568 మందికి గాను 1,987 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 77 శాతం నమోదైంది.

గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణత శాతం గతేడాది కంటే కొంత మెరుగ్గా ఉంది. 2021–22లో మొదటి సంవత్సరంలో 59 శాతం ఫలితాలు వస్తే, 2022–23(ఈ ఏడాది)లో 63 శాతం సాధించారు. రెండో సంవత్సరం గతేడాది 65 శాతం ఫలితాలు రాగా ఈ ఏడాది 70 శాతం ఫలితాలు సాధించారు. ఇంటర్ తరగతుల నిర్వహణలో అధికారులు చూపిన కృషి ఫలితంగానే ఫలితాలు మెరుగుపడినట్లయింది.

ప్రభుత్వ కాలేజీల్లో మిశ్రమ ఫలితాలు

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 38 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 5,787 మంది హాజరు కాగా 1,199 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 20.72 శాతం నమోదైంది. రోలుగుంట 60.29 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, అనంతగిరి, ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఏ ఒక్కరు కూడా పాసవ్వలేదు. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 6,043 మంది హాజరు కాగా 1,970 మంది ఉత్తీర్ణులయ్యారు. జి.మాడుగుల 67.11 శాతం ఉత్తీర్ణతతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో టాప్‌గా నిలిచింది.

ప్రభుత్వ కళాశాల విద్యార్థినికి టాప్ మార్కులు



సాయి హర్షిణి

అగనంపూడి : ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని డి.సాయి హర్షిణి ఎంపీసీలో 972 మార్కులు సాధించింది. కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకుల పర్యవేక్షణలో చదువుకొని మంచి మార్కులు సాధించినట్లు సాయి హర్షిణి తెలిపింది. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించి సివిల్ ఇంజినీరింగ్ చేయడమే తన ఆశయమని పేర్కొంది. తన తండ్రి ఎలక్ట్రీషియన్ కాగా తనను ఎంతగానో ప్రోత్సహించారని తెలిపింది.

కిడ్నీ రాకెట్ కలకలం

పీఎం పాలెం: విశాఖలో కిడ్నీ రాకెట్ వ్యవహారం సంచలనం రేకెత్తిస్తోంది. డబ్బు ఆశ చూపి ఒక వ్యక్తి నుంచి అనధికారికంగా కిడ్నీ తొలగించిన వ్యవహారం వెలుగుచూడడంతో కలకలం రేగింది. ఇస్తానన్న డబ్బు ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితుడు పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిడ్నీ రాకెట్ వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ వాంబేకాలనీలో గోరుజల్ల వినయ్‌కుమార్ కుటుంబంతో నివసిస్తున్నాడు. అదే కాలనీలో ఉంటున్న కామరాజు అనే వ్యక్తి కుమార్ ఇంటికి వచ్చి కిడ్నీ అమ్మి సులువుగా డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపించాడు. కిడ్నీ ఇస్తే రూ.8.5 లక్షలు ఇస్తానని నమ్మించాడు. దీంతో కామరాజు మాటలు నమ్మిన కుమార్‌ను 2022 అక్టోబరు 17న కలెక్టర్ ఆఫీస్ సమీపంలో ఉన్న ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌కు తీసుకెళ్లి అక్కడ వైద్య పరీక్షలు చేయించాడు. అనంతరం కుమార్ భయపడి 2022 నవంబర్‌లో హైదరాబాదులో ఉన్న తన కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లిపోయాడు. కొద్ది రోజుల తరువాత కుమార్‌కు కామరాజు ఫోన్‌చేసి కిడ్నీ ఇవ్వకపోతే వైద్య పరీక్షలకు ఖర్చు అయిన రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో కుమార్ కిడ్నీ ఇవ్వడానికి అంగీకరించి విశాఖకు వచ్చాడు. 2022 డిసెంబరు 16న రైల్వే న్యూ కాలనీ వద్ద కుమార్ వేచి ఉండగా, అక్కడకు కామరాజు, ఎలీనా, శ్రీను వచ్చి అతడిని ఆటోలో పెందుర్తిలో ఉన్న తిరుమల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదే రోజు అర్ధరాత్రి ఆస్పత్రి వైద్యులు కుమార్ కిడ్నీని తీసుకున్నారు. అనంతరం కుమార్‌ను ఆస్పత్రిలోనే వదిలేసి కామరాజు వెళ్లిపోయాడు. అదే నెల 24న కుమార్ ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్నాడు. కుమార్ ఆస్పత్రిలో ఉన్న సమయంలో రూ.5 లక్షలు చూపించి అందులో రూ. 2.5 లక్షలు మాత్రమే కామరాజు, శ్రీను ఇచ్చినట్టు కుమార్‌కి అతని తల్లి చెప్పింది. అప్పటి నుంచి మిగిలిన డబ్బులు ఇవ్వాలని కోరినప్పటికీ వారు తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో కామరాజు, ఎలీనా, శ్రీనుతోపాటు ఆసుపత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కుమార్ మంగళవారం రాత్రి పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబద్ధతతో పనిచేయండి



మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిబద్ధతతో పనిచేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు. ఏయూ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫుట్‌పాత్ ఆక్రమణలు, భవన నిర్మాణ వ్యర్థాలు, జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణ, ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందివ్వాలని ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. సచివాలయ పరిధిలో ఫుట్‌పాత్‌లు, వీధిరోడ్లు ఆక్రమణ జరగకుండా చూడాలని, రోడ్లకిరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా నిరోధించాలని, జీవీఎంసీ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాలన్నారు. ప్లాన్ మంజూరుతో పాటు భవన నిర్మాణదారులు ప్లాన్ ప్రకారం ఇళ్లు నిర్మిస్తున్నదీ లేనిదీ చూడాలన్నారు. వీధివిక్రయదారులు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు క్రమపద్ధతిలో ప్లాన్ ఇవ్వాలన్నారు.

వసతి దీవెనతో విద్యాభివృద్ధి



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

- 43,938 మందికి రూ. 41.17 కోట్లు జమ
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: జగనన్న వసతి దీవెన పథకంలో భాగంగా జిల్లాలోని 43,938 మంది విద్యార్థులకు రూ.41,17,45,000 లబ్ధి చేకూరింది. అనంతపురం జిల్లా నార్పలలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న వసతి దీవెన పథకం ప్రారంభించగా.. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ మల్లికార్జున, అధికారులు, విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం రూ.41,17,45,000 మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి లబ్ధిదారులైన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు వసతి దీవెన పథకం ఎంతో మేలు చేస్తోందని అన్నారు. విద్యార్థులకు చెక్కు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదువుకుంటున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు లభించాయన్నారు. 43,938 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లుల ఖాతాల్లో రూ.41,17,45,500 జమ చేసినట్లు తెలిపారు. డబ్బులు జమ కాకుంటే సమీప సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. జేసీ కె.ఎస్.విశ్వనాథన్, సాంఘిక సంక్షేమశాఖ జేడీ డి.వి.రమణమూర్తి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చిన్నతల్లి, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ మధుసూదన్, నాగ వంశం సంక్షేమ కార్పొరేషన్ చైర్ పర్సన్ అప్పలకొండ పాల్గొన్నారు.

చిట్టీ.. నీకు అన్నీ తెలుసు

- సూసైడ్ నోట్ రాసి గర్భిణీ ఆత్మహత్య
- ఆర్.కె.బీచ్ ఇసుకలో కూరుకుపోయిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు
- వరకట్న వేధింపులే కారణం: మృతురాలి తల్లి



శ్వేత (ఫైల్)

బీచ్‌రోడ్డు: 'చిట్టీ.. నాకు ఎప్పుడో తెలుసు.. నేను లేకుండా నువ్వు బిందాస్‌గా ఉండగలవని. నీకు అసలు ఏ మాత్రం ఫరక్ పడదు. ఎనీ వే ఆల్ ద బెస్ట్ ఫర్ యువర్ ఫ్యూచర్ అండ్ న్యూ లైఫ్. చాలా మాట్లాడడానికి ఉన్నా కూడా నేను ఏం మాట్లాడటం లేదు. బికాజ్.. నువ్వు బయటకు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా యూ నో ఎవ్రీ థింగ్. జస్ట్ క్వశ్చన్ యువర్ సెల్ఫ్. ఏ బిగ్ థ్యాంక్స్ ఫర్ ఎవ్రీ థింగ్' అంటూ భర్తకు లేఖ రాసి ఐదు నెలల గర్భిణీ ఆత్మహత్య చేసుకుంది. ఈ సమయంలో ఎంతో ఆనందంగా గడపాల్సిన ఆమె..ఆర్.కె.బీచ్‌లో విగతజీవిగా కనిపించింది. వరకట్న వేధింపులే తన కుమార్తె మరణానికి కారణమని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

పెదగంట్యాడ మండలం నడుపూరులో గురువెల్లి మణికంఠ తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. దొండపర్తికి చెందిన శ్వేత(24)తో గత ఏడాది మణికంఠకు వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. మణికంఠ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజుల కిందట అతను హైదరాబాద్ వెళ్లాడు. శ్వేతను ఇక్కడే అతని తల్లిదండ్రుల వద్ద ఉంచాడు. మంగళవారం సాయంత్రం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె సాయంత్రం 6.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తర్వాత ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆమె అత్తామామలు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో ఆమె మామ శాంతారావు అర్ధరాత్రి 12 గంటల సమయంలో న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రాత్రి పెట్రోలింగ్ చేసే పోలీసుల గ్రూపులో ఆమె ఫొటో పోస్ట్ చేసి అదృశ్యమైందని వివరాలు పెట్టారు. అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో ఆర్.కె.బీచ్‌లో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు 3వ పట్టణ పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని శ్వేత ఫొటోతో సరిపోల్చి.. న్యూపోర్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇసుకలో కూరుకుపోయిన ఆమె మృతదేహాన్ని చూసి.. ఎవరో హత్య చేసి తీరంలో పూడ్చేసినట్లు ముందు అనుమానాలు వ్యక్తమయ్యాయి. తన భర్తతో ఉన్న కుటుంబ కలహాలతో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

వివాహమై ఏడాది పూర్తి


శ్వేత, మణికంఠ దంపతుల మొదటి వివాహ వార్షికోత్సవం ఈ నెల 15న జరిగింది. అనంతరం మణికంఠ హైదరాబాద్ వెళ్లాడు. శ్వేత మరణ వార్త తెలియగానే వెంటనే నగరానికి చేరుకున్నాడు. ఆత్మహత్యకు ముందు ఆమె రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో చిట్టీ(మణికంఠ ముద్దు పేరు) నేను లేకపోయినా నువ్వు బిందాస్‌గా జీవిస్తావని నాకు తెలుసు. బెస్ట్ ఆఫ్ లక్ ఫర్ యువర్ ఫ్యూచర్. బిగ్ థ్యాంక్స్ ఫర్ ఎవ్రీ థింగ్ అని రాసి ఉంది.

భర్త ప్రేమకు నోచుకోలేదు

పెళ్లి అయిన తర్వాత అత్త, మామ, ఆడపడుచు భర్త ఎంతగానో నా బిడ్డను వేధించారని శ్వేత తల్లి రమాదేవి ఆరోపించారు. 'ఆ ఇంట్లో ఉండలేకపోతే వచ్చేయమ్మా.. పెంచుకుంటా అని చెప్పాను. అయినా సరే భర్త ప్రేమ కోసం ఆ ఇంట్లోనే ఉంది. ఐదు నెలల గర్భంతో ఉన్న నా కుమార్తెపై కనీసం కనికరం లేకుండా అత్తమామలు చిత్రహింసలకు గురి చేశారు. ఇంట్లో పనులన్నీ తనతోనే చేయించారు. అల్లుడు వాళ్ల అమ్మానాన్నలకే వత్తాసు పలికేవాడు. ప్రతి రోజూ ఫోన్ చేసి ఏడ్చేది. నెల రోజుల కిందట విడాకులు ఇస్తామని శ్వేతను మణికంఠ బెదిరించాడు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతానని చెప్పింది. పెళ్లైన తర్వాత చదివించకుండా వంటింటికే పరిమితం చేశారు. నా ఒక్కగానొక్క కుమార్తెను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారు' అంటూ ఆమె వాపోయారు. వరకట్న వేధింపులే తన కుమార్తె మరణానికి కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కట్నం తీసుకురావాలని కొద్ది నెలలుగా వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు శ్వేత భర్త మణికంఠ, అత్త, మామ, ఆడపడుచు భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో కేసును విచారిస్తున్నట్లు తెలిపారు.

ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని భావించా..

'శ్వేత బీటెక్ సివిల్ ఇంజినీర్ చదువుకుంది. సివిల్స్ సాధించాలని పట్టుదలతో నిరంతరం చదువుకుంటూ ఉండేది. అందుకు నేను కూడా ప్రోత్సహించా. కుటుంబంలో చిన్న చిన్న గొడవలు సహజం. ఆ మాత్రానికే ఆత్మహత్య చేసుకుంటుందని అనుకోలేదు. ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని భావించాను. ఇలా శవమై మమ్మల్ని బాధపెట్టింది' అని మణికంఠ తెలిపారు.



సూసైడ్ నోట్

దేవాలయ ఉద్యోగులకు పదోన్నతి

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న ముగ్గురు అధికారులకు పదోన్నతి లభించింది. ఈ ముగ్గురిని దేవదాయశాఖ పరిధిలో గ్రేడ్ – 3 కార్యనిర్వహణాధికారులు (ఈవో)గా నియమించారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. జ్ఞానాపురం శ్రీ ఎర్నిమాంబ దేవాలయంలో పనిచేస్తున్న బి.మురళీమోహనరావు, చిన్నవాల్తేరులోని శ్రీ కనక దుర్గ అమ్మవారి దేవాలయంలో పనిచేస్తున్న జి.గంగారావు అలియాస్ బాబూరావు, అనకాపల్లిలోని శ్రీనూకాలమ్మ అమ్మవారి దేవస్థానంలో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసులకు పదోన్నతి లభించింది. ఈవోలుగా పదోన్నతి పొందిన వీరు బుధవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. అనంతరం దేవదాయశాఖ ఉప కమిషనర్ (డీసీ) ఎన్.సుజాత, సహాయ కమిషనర్ (ఏసీ) కె.శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ముగ్గురికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది.

శివ హత్య కేసులో మరో ఐదుగురు అరెస్ట్

ఎంవీపీ కాలనీ: విశాఖ జిల్లా మారికవలస ప్రాంతానికి చెందిన రిక్కా జగదీశ్వరరావు అలియాస్ శివ హత్యకేసులో మరో ఐదుగురిని ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో శివను జాలరిపేటలో నివసిస్తున్న రౌడీషీటర్ సాయి తన అనుచరులు, స్నేహితులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో తిప్పుతూ చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా రణస్థలం దరి కొవ్వాడ వద్ద దారుణంగా హత్యచేసి పూడ్చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై గత వారం కేసు నమోదు చేసి రౌడీ షీటర్ సాయిని అరెస్ట్ చేసిన ఎంవీపీ పోలీసులు తాజాగా మరో ఐదుగురిని అరెస్ట్ చేశారు.

వీరిలో పెదజాలరిపేటకు చెందిన పాసి శ్రీనివాస్ (25), కొత్తగాజువాకకు చెందిన జారజపు యశ్వంత్ (25), వెంపటపు పవన్‌కల్యాణ్ (23), పాతగాజువాకకు చెందిన బొడ్డు కృష్ణచైతన్య (21), మచ్చా సాయి (20) ఉన్నారు. ఈ హత్య కేసులో పది మందిని ముద్దాయిలుగా పోలీసులు ప్రకటించగా ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రాయపూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ డివిజన్, టిట్లాఘడ్ – తెరుబలి, టిట్లాఘడ్ – లఖోలి సెక్షన్ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- మే 1న విశాఖపట్నం – రాయ్‌పూర్ – విశాఖపట్నం (08527 / 08528) పాసింజర్ స్పెషల్ ఇరువైపులా రద్దు చేశారు.
- ఏప్రిల్ 30న తిరుపతిలో బయల్దేరాల్సిన తిరుపతి – బిలాస్‌పూర్ (17482) ఎక్స్‌ప్రెస్ దారి మళ్లించారు. ఇది టిట్లాఘడ్, సంబల్‌పూర్ మీదుగా బిలాస్‌పూర్ చేరుకుంటుంది.

పలు కేసుల్లో ముగ్గురు అరెస్ట్

రూ.28 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

అల్లిపురం (విశాఖ దక్షిణ): వివిధ కేసుల్లో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.28 లక్షలు విలువ గల 17 తులాల బంగారు ఆభరణాలు, అర కేజీ వెండి, రూ.9.లక్షల 5వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో నగర క్రైం డీసీపీ జి.నాగన్న విలేకరులకు వివరాలు వెల్లడించారు.

మంచినీళ్లు అడిగి..

పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద, సప్తగిరి కాలనీ, ఎంఐజీ-2, ప్లాట్ నంబరు-32లో నివసిస్తున్న సోమయాజుల సుబ్బలక్ష్మి(72) ఈ నెల 24వ తేదీన సాయంత్రం 4 గంటల సమయంలో స్నానానికి వెళ్తూ మెడలోని పుస్తెలతాడు, నల్లపూసలు, బంగారు ముత్యాల చైన్ హాల్‌లో టేబుల్‌పై పెట్టారు. అనంతరం ఆమె బయటకు వచ్చేసరికి. ఓ మహిళ జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలినని చెప్పి మంచినీరు అడిగింది. ఆమె మంచినీళ్లు తెచ్చేందుకు లోపలకు వెళ్లి వచ్చేలోగా ఆ మహిళ టేబుల్‌పై ఉన్న బంగారు వస్తువులను తీసుకొని పరారైంది. బాధితురాలు వృద్ధాప్యం వల్ల ఆమె వెంట పరిగెత్తేలేకపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. పీఎం పాలెం క్రైం పోలీసులు, నార్త్ ఏసీపీ డి.రమేష్ పర్యవేక్షణలో క్రైం ఎస్ఐ ఆర్.శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి సీసీ ఫుటేజీలో ఆమె వేసుకున్న డ్రస్ ఆధారంగా కొమ్మాదిలోని ప్రణవ్ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భార్య పత్తి దుర్గగా గుర్తించారు. నిందితురాలిని బుధవారం ఉదయం అయ్యప్పనగర్‌రోడ్, కొమ్మాదిలో అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు

మరో కేసులో..

నిందితురాలిని ప్రశ్నించిన సమయంలో ఆమె గత ఏడాది ఏప్రిల్‌లో చేసిన దొంగతనం బయటపడింది.

ఆమె ఉంటున్న అపార్టుమెంట్‌లో వాటర్‌కేన్ వేసేందుకు వెళ్లి ఓ ఇంట్లో సుమారు 85 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు పేర్కొంది. దీంతో ఆ ఆభరణాలను కూడా రికవరీ చేసినట్లు తెలిపారు. తన భర్త ఆదాయం సరిపోవడం లేదని, తన తండ్రికి అనారోగ్యం కారణంగా సుమారు రూ.9లక్షలు అప్పు చేసినట్లు.. ఆ అప్పులు తీర్చేందుకు దొంగతనం చేసినట్లు నిందితురాలు వెల్లడించిందని చెప్పారు.

నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి..

శంకరమఠం రోడ్డులో గల సువర్ణ సింబల్ ఎస్టేట్‌ల పేరుతో బండారు రవి, గట్టిరెడ్డి నాయుడులు కార్యాలయం నిర్వహిస్తున్నారు. వీరి వద్ద సీతంపేట ప్రాంతానికి చెందిన వంటకు సూర్యనారాయణ ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన ఆఫీస్ టేబుల్‌లో ఉంచిన రూ.9 లక్షల 5వేలు దొంగతనం జరిగింది. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈస్ట్ క్రైం సీఐ ఎర్రంనాయుడు, క్రైం ఎస్ఐ ఖగేశ్వరరావు తమ సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సూర్యనారాయణను ఈ నెల 21వ తేదీన రైల్వే స్టేషన్ దరి సీఎంఆర్ బస్టాప్‌లో అదుపులోకి తీసుకుని, పోయిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

ఎలక్ట్రీషియన్, ప్లంబర్‌గా పగలు ఇళ్లకు వచ్చి రాత్రుళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని నాల్గవ పట్టణ పోలీసులు, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాకుళం జిల్లా, రాజాం మండలం, ఒమ్మి గ్రామానికి చెందిన నల్ల స్వాతికుమార్, రైల్వే న్యూకాలనీ, వెంకటేశ్వరకాలనీలో నివసిస్తున్నాడు. ఇతను వృత్తి పరంగా ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన తాటిచెట్లపాలెం, సంతోషమాత దేవాలయం వద్ద నివసిస్తున్న సదరం సురేష్ ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో సుమారు 186.5 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించాడు. అదే విధంగా గత ఏడాది జూలై 11వ తేదీన వెంకటేశ్వరకాలనీలో గల లక్ష్మి ఇంట్లోకి రాత్రి సమయంలో ప్రవేశించి బీరువాలోని 3, 3/4 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించాడు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న క్రైం డీసీపీ జి.నాగన్న

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

సౌత్ జైలురోడ్డు, డీఆర్ఎం కార్యాలయం వెనుక గల రైల్వే క్వార్టర్స్‌లో నివసిస్తున్న బలగ వెంకట రమణ మూర్తి ఇంట్లోకి నిందితుడు ప్రవేశించి బీరువాలోని సుమారు 400 గ్రాముల వెండి పూజ సామగ్రి అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నగర క్రైం డీసీపీ జి.నాగన్న ఆదేశాల మేరకు డీసీపీ క్రైం డి.గంగాధరం, ఏడీసీపీ క్రైం డి.సూర్య శ్రావణ్‌కుమార్ ఉత్తర్వుల మేరకు ఈస్ట్ క్రైం సీఐ ఎర్రంనాయుడు తమ సిబ్బందితో కలసి నిందితుడు నల్ల స్వాతికుమార్‌ను బుధవారం దొండపర్తి, శ్రీ సూర్య జంక్షన్‌లో అదుపులోకి తీసుకున్నారు. మూడు నేరాలలో పోయిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

సిబ్బందికి అభినందనలు

సాంకేతికత సహాయంతో నిందితులను సకాలంలో గుర్తించి.. సొత్తును స్వాధీనం చేసుకున్న సిబ్బందిని క్రైం డీసీపీ జి.నాగన్న, నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ తరఫున అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

కులమతాల మధ్య బీజేపీ చిచ్చు



స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్న నాయకులు



బహిరంగసభకు తరలివచ్చిన నాయకులు, కార్మికులు

- స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం
- వామపక్ష నేతలు రాఘవులు, నారాయణ

కూర్మన్నపాలెం: కులమతాల మధ్య చిచ్చుపెట్టడమే కాకుండా.. ఆర్ఎస్ఎస్ భావాలను ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద బుధవారం బహిరంగ సభ జరిగింది. ప్రాణత్యాగాలతో సాధించిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చిన వారు.. కలిసి పోరాటం చేస్తే కొనడానికి ఎవరైనా వస్తారా అని ప్రశ్నించారు. పెద్దవాళ్లకు జీఎస్టీ తగ్గించి పేదలపై పన్నుల భారం వేస్తున్నారని, రైతులకు రాయితీలు ఇవ్వకుండా.. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇవ్వడం అన్యాయమన్నారు. దేశంలో ఉన్న పోర్టులన్నీ అదానీకి అప్పగిస్తున్నారని, ముద్రా పోర్టు నుంచి గంజాయి తరలిస్తున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను కూడా అదానీకి అప్పగించాలని మోదీ ప్రభుత్వం తహతహలాడుతోందన్నారు. ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎదుర్కోవాలని కోరారు. పవన్ కల్యాణ్ కోసం ఎక్కువగా మాట్లాడుకోవడం అనవసరమని, గల్లీలో బీజేపీపై ఉద్యమాలు చేయడం, ఢిల్లీలో బీజేపీ పెద్దలను కలవడం అతనికి అలవాటేనన్నారు. పొత్తులపై ఆసక్తి లేదని చెప్పే చంద్రబాబు.. బీజేపీతో పొత్తుల కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో నడపాలన్నారు. నాయకులు జె.వి.సత్యనారాయణమూర్తి, కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజు, సీఐటీయూ నాయకులు అయోధ్యరామ్, సీహెచ్ నరసింగరావు, ఏఐటీయూసీ నాయకులు ఆదినారాయణ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

పాడేరు రూరల్ : కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టి లోయలోకి దూసుకుపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పాడేరు–చోడవరం ప్రధాన రహదారిలోని కోమాలమ్మ తల్లి ఘాట్ మలుపు వద్ద బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ముంచంగిపుట్టు మండలం కిలగాడ గ్రామానికి చెందిన చెండా సుబ్బారావు(55), భార్య మహేశ్వరి(50) విశాఖ నగరంలో నివసిస్తున్నారు. చెండా సుబ్బారావు విశాఖలో ఎల్ఐసీ కార్యాలయంలో డివిజనల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. స్వగ్రామం కిలగాడలో మంగళవారం జరిగిన గంగమ్మతల్లి పండగకు వారు వచ్చారు. పండగ ముగియడంతో బుధవారం సాయంత్రం బంధువు సమరెడ్డి పూర్ణచంద్రరావుతో కలిసి కారులో విశాఖ బయలుదేరారు. పాడేరు–చోడవరం ప్రధాన రహదారిలోని కోమాలమ్మ తల్లి ఘాట్ మలుపు వద్దకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టింది. లోయలోకి దూసుకుపోయింది. సంఘటన స్థలంలోనే మహేశ్వరితోపాటు కారు డ్రైవర్ కంద్రాపు ఉమామహేశ్వరరెడ్డి తీవ్రంగా గాయపడి మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సుబ్బారావు, సమరెడ్డి పూర్ణచంద్రరావులను 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారావు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.



మహేశ్వరి, సుబ్బారావు (ఫైల్)



కారు నుంచి క్షతగాత్రులు, మృతదేహాలను బయటకు తీస్తున్న స్థానికులు

గ్రూప్ 1, 2 అభ్యర్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

సీతంపేట: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించే గ్రూప్ 1, 2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహించనున్నట్టు 21వ సెంచరీ ఐఏఎస్ సంస్థ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే ఆసక్తి ఉండి ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వచ్చే నెల 7న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి గ్రూప్1, 2 పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9133237733, 9133637733లో సంప్రదించవచ్చు.

నేడు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు కౌన్సెలింగ్

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖలో ఖాళీగా ఉన్న స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీకి గురువారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో స్పెషల్ ఎడ్యుకేషన్ కేటగిరీలో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఎస్సీ మహిళ, ఎస్సీ జనరల్, ఎస్టీ వుమెన్ పోస్టుల భర్తీకి అర్హత గల అభ్యర్థులు అందుబాటులో లేరు. దీంతో వీటిని భర్తీ చేసే అవకాశం లేదు. ఒక పోస్టుకు సంబంధించి అభ్యర్థులు కోర్టులో కేసు వేసినందున, దాన్ని కూడా తాత్కాలికంగా వదిలేస్తున్నారు. దీంతో మిగిలిన ఒక పోస్టుకు అర్హత గల అభ్యర్థికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను పరిశీలించి, తదుపరి కౌన్సెలింగ్ మేరకు పోస్టింగ్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి ఇండస్ట్రియల్ కమ్ బిజినెస్ ఎక్స్‌పో

అక్కిరెడ్డిపాలెం: ఇండస్ట్రియల్ కమ్ బిజినెస్ ఎక్స్‌పో–2023కు సర్వం సిద్ధమైంది. ఆటోనగర్ డీ– బ్లాక్‌లోని గోపాల్ ఇంజినీరింగ్ కార్పొరేషన్, డోజీకో కంపెనీ ఎదురుగా గల సరిపల్లి గ్రాండ్‌లో 27, 28, 29వ తేదీల్లో ఈ ఎక్స్‌పో జరగనుంది. ఇందులో భాగంగా ఉత్పత్తుల ప్రదర్శనకు 60 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల ఎక్స్‌పో ఉంటుందని నిర్వాహకుడు, ఫ్లోరిష్ క్రియేషన్ యజమాని డి.వినోద్ తెలిపారు.

తిమ్మాపురంలో ‘ఉక్కు సత్యాగ్రహం’

కొమ్మాది: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కథాంశంతో జనం ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దర్శక, నిర్మాత పి.సత్యారెడ్డి తెరకెక్కిస్తున్న ఉక్కు సత్యాగ్రహం అనే సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలను బీచ్ రోడ్ తిమ్మాపురంలో గల డాక్టర్ బి.రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో బుధవారం చిత్రీకరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వల్ల ప్రజలకు జరిగే నష్టం, అన్యాయాలను తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన, ర్యాలీలకు సంబంధించి ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఆయన ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సీనియర్ నటుడు ప్రసన్న కుమార్, గాజువాక ఝాన్సీలపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ప్రధాన పాత్రలో ప్రజా గాయకుడు గద్దర్ నటిస్తున్నట్లు దర్శకుడు సత్యారెడ్డి తెలిపారు.



ఓ సన్నివేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

శ్రీచైతన్య విద్యార్థులకు ఉత్తమ మార్కులు

సీతంపేట: ఇంటర్ ఫలితాలలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో టి.మౌనిక 466 మార్కులు సాధించింది. 465 ఆపైన 21 మంది, 460 ఆపైన 335 మంది, 430 ఆపైన 2,909 మంది సాధించారు. బైపీసీలో పి.జ్యోతిర్మయి 435, ఎస్.పావని 435, పి.ధక్షేష్ 435, పి.కీర్తన 435, ఆర్.కీర్తి 435 మార్కులు సాధించారు. 430 పైన 74 మంది సాధించారు. ఎంఈసీ, సీఈసీ విభాగంలో టి.విజయలక్ష్మి 484, ఎస్.కోమల్ 482 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఆర్.జ్యోతిభాస్కర్ 990, జె.ఈక్షిత 989, పి.లహరి 989, బి. హిమబిందు 989, కె.నవ్య 989 సాధించారు. బైపీసీలో జి.సంజన గాయత్రి 988,జి.శైలుశ్రీ 986, ఎంఈసీలో ఎం.మేఘన 979, పి.మహేష్ 975, బి. ఉషారాణి 975 సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఏజీఎం కె.వి.రమణ, డీన్స్ కె.బంగారుబాబు, ఎస్.రఘుకుమార్ అభినందించారు.